క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొద్దం: మండలంలోని కలిపి గ్రామ పంచాయతీ బూదిపల్లి, ఎస్సీ, బీసీ కాలనీల్లో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరవుతారన్నారు.

కదిరేపల్లి సచివాలయం పరిధిలో..

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి సచివాలయం పరిధిలోని కొడిగానిపల్లి, కంబాలపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, సర్పంచ్ నర్సేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు.

దుకాణంలో చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద కెనరా బ్యాంకు ముందు ఉన్న ఓ షాప్‌లో చోరీ జరిగింది. షాప్ యజమాని మల్లికార్జున తెలిపిన వివరాలు.. సోమవారం రాత్రి మల్లికార్జున కిరాణా షాప్ బంద్ చేసి, ఇంటికి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున దుండగులు దుకాణంలోకి చొరబడి చోరీ రూ.3 వేలు విలువైన సిగరెట్ ప్యాక్స్, రూ.500 నగదు ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే మరో షాప్‌లో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి లేపాక్షికి చెందిన సంతమార్కెట్ కంట్రాక్టర్ సైపుల్లా రూ. 20,116, అలాగే ముద్దిరెడ్డిపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ నాగభూషణ రెడ్డి రూ.10,105 చొప్పున విరాళాలను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైస్ ఎంపీపీ అంజిన రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, కమిటీ సభ్యులు రాంప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

గుడిబండ: మండల కేంద్రంలోని చెరువులో చేపల పెంపకానికి బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరుణాకర్‌గౌడు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.15,000 ధరావత్తు చెల్లించాలన్నారు.

బస్సు, జీపు ఢీ

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తూ బస్సు, జీపు ఢీకొన్నాయి. వివరాలు.. శిరా నుంచి పావగడకు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు, మల్లినమడుగు గ్రామానికి చెందిన బోరుబావులు రిపేరీ చేసే జీపు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో జీపు బోల్తా పడింది. అయితే ఎవరికీ ఏ అపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్సీ కృషితో దివ్యాంగుడికి పింఛన్



ఫారూక్‌కు పింఛన్ పుస్తకం, నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: గత టీడీపీ హయాంలో పింఛన్ కోసం అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఓ విభిన్న ప్రతిభావంతుడికి పింఛన్ అందలేదు. విసిరి వేసారి పోయి పింఛనే వద్దకున్న వారికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కృషితో పింఛన్ మంజూరైంది. వివరాలు.. ముక్కడిపేటకు చెందిన ఫారూక్ పుట్టుకతో వికలాంగుడు. సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా అతడి వేలిముద్రల కోసం వలంటీరు, సచివాలయ కార్యదర్శులు కృషి చేసినా పడలేదు. ఈ విషయాన్ని కౌన్సిలర్ నాజియా, నాయకులు కింగ్‌సే షఫీ దృష్టికి తీసుకెళ్లగా వారు సమస్యను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ సొంత ఖర్చులతో వాహనం ఏర్పాటు చేసి ఫారూక్‌ను ఐరిష్ కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అయినా ఐరిష్ పడలేదు. దీంతో మున్సిపల్ కార్యాలయంలోని మీసేవా కేంద్రంలో గంటకు పైగా శ్రమించి ఫారూక్ వేలిముద్రలను తీసుకోవడంతో పింఛన్ మంజూరైంది. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ చేతుల మీదుగా ఫారూక్‌కు నూతన పింఛన్ పుస్తకం, పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ మణి, అయూబ్ వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, వెల్ఫేర్ సెక్రటరీ ఆలం వలీ, వలంటీర్ రసూల్ పాల్గొన్నారు.

ఆలయ భూములు కాపాడాలి

హిందూపురం: పట్టణంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయ పరిధిలోని భూములను కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని గ్రూపు ఆలయ ఈఓ నాగేంద్రుడు మంగళవారం తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్లు 29, 30లోని భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై జిల్లా దేవాదాయశాఖ అధికారి, కర్నూలు ఉపకమిషనర్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

జగనన్నకే మా దీవెనలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు సువర్ణమ్మ కదిరేపల్లి గ్రామం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న వసతి దీవెన ద్వారా రూ.20,800, జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.1,29,300, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,300, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.16,678, రైతు భరోసా ద్వారా రూ.23,500 చొప్పున ప్రభుత్వ పథకాల ద్వారా రూ.2,27,778 లబ్ధి చేకూరింది. పేదలకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎప్పటికీ మరువలేమని సువర్ణమ్మ చెబుతోంది. మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని తెలిపింది.

- కులమతాలకు అతీతంగా పథకాలు అందుతున్నాయి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారుల ఆనందం



గోరంట్ల: పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



కదిరేపల్లిలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాతే మాకు మంచి జరుగుతోందని, పథకాలతో ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్న జగనన్నకే మరోసారి మా దీవెనలు ఉంటాయని లబ్ధిదారులు, మహిళలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కదిరేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ లబ్ధి పొందిన బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న పరిపాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని, ఆయనకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలను విని మోసపోవద్దని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి సీఎంగా చేసుకోవాలన్నారు. ప్రజలు తెలిపిన చిన్న చిన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనిబాయి, ఎంపీపీ కవిత, సర్పంచ్ నర్సేగౌడు, ఎంపీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, నాయకులు కెంచప్ప, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మూర్తి, రమేష్, భాస్కర్‌రెడ్డి, నారాయణప్ప, గోవిందప్ప, జంపన్న పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు..

గోరంట్ల: అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల పంచాయతీ పరిధిలోని 4వ వార్డులో సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, నవరత్నాల్లోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మోస పూరిత హామీలు ఇచ్చి, అన్ని వర్గాలను మోసం చేసినట్లు గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలంటే జన్మభూమి కమిటీకి కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అయితే సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత గ్రామ స్వరాజ్యమే ధ్యేయ్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. నిరుపేదను గుర్తించి, ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందజేస్తున్నట్లు వివరించారు. మేనిఫెస్టోలోని హామీలను 98 శాతం నెరవేర్చినట్లు పేర్కొన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తుంటే.. ప్రతిపక్ష పార్టీ, పచ్చ మీడియా రాజకీయ లబ్ధి కోసం కుట్రలు పన్నుతోందన్నారు. ప్రజలందరూ జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర సహకార బ్యాంక్ వారు రుపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు జయరాం నాయక్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ శంకరరెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, వైస్ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, కురబ రామలక్ష్మమ్మ, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్ నాయకులు సమరసింహారెడ్డి, హిదయతుల్లా పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

హిందూపురం టౌన్: ఆత్మవిశ్వాసంతో విభిన్న ప్రతిభావంతులు ఏదైనా సాధించగలరని ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం అన్నారు. మంగళవారం స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో అంధుల లిపి నిర్మాత లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని సత్యసాయి వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ది విజువల్లీ ఇంపేర్డ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అంధుల ఆటల పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, రీడింగ్, రైటింగ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాధాసిల్క్స్ శారీస్ బద్రీనాథ్, సంఘం ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యలో ప్రావీణ్యం సాధించాలి

పెనుకొండ: విద్యార్థులు డిజిటల్ విద్యలో ప్రావీణ్యత సాధించాలని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూఖ్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, టౌన్ కన్వీనర్ బోయ బాబు, కౌన్సిలర్లు రఘునాథ రెడ్డి, తయూబ్, సద్దాం పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్

రొద్దం: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మార్కింగ్ ఇచ్చారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని తెలిపారు. మార్కింగ్ ఇచ్చిన కొలతల ప్రకారమే ఇంటి నిర్మాణం ఉండాలన్నారు. లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తే బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సోనీ, పవన్, ప్రణీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు వజీర్ పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం



హిందూపురం టౌన్: లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



లబ్ధిదారులకు పింఛన్‌సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

హిందూపురం టౌన్/గోరంట్ల/పెనుకొండ రూరల్/హిందూపురం/లేపాక్షి/అమరాపురం/రొళ్ల: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాత అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం హిందూపురంలోని 13వ వార్డు ఎస్.సడ్లపల్లి వార్డు సచివాలయంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ పుస్తకాలు, నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు సునీత, మారుతీరెడ్డి, రహమత్‌బీ, మణి, అయూబ్, ముస్తాక్, కోఆప్షన్ సభ్యుడు రహమత్ పాల్గొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. మంగళవారం గోరంట్లలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన నూతన పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలోనే గోరంట్ల మండలానికి అత్యధికంగా 399 నూతన ఫింఛన్లు మంజూరైనట్లు వివరించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ భాషా, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయ రెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం పంచాయతీలో ఎంపీడీఓ శివశంకరప్ప చేతుల మీదుగా 12 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. శెట్టిపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పింఛన్ లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్యామలాబాయి, ఎంపీటీసీ జ్యోతిబాయి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని గర్వంగా చెప్పగలమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబివుల్లా అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో మంజూరైన కొత్త పింఛన్లతో పాటు పెంచిన పింఛన్ సొమ్మును వార్డు కౌన్సిలర్లు, సచివాలయ కార్యదర్శులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ మాజున్, తదితరులు పాల్గొన్నారు. లేపాక్షి మండలం, శిరివరంలో సర్పంచ్ నేత్రావతి చేతుల మీదుగా 25 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. వెన్నుముక సమస్యతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్లూరు గ్రామానికి చెందిన కే.బాబన్నకు వలంటీర్ చెన్నప్ప అనంతపురం వెళ్లి పింఛన్ అందజేశారు. రొళ్ల మండల పరిధిలోని బీజీహళ్లిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ సదాశివప్ప పంపిణీ చేశారు. అలాగే మండల వ్యాప్తంగా కొత్తగా 212 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. అమరాపురం మండలానికి కొత్తగా 282 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. అమరాపురం మండలానికి కొత్తగా 282 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి చేతులమీదుగా పింఛన్లు అందజేస్తామన్నారు. హిందూపురంలోని 27వ వార్డు అంబేడ్కర్ నగర్‌కు చెందిన నరసింహమూర్తి అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ అశ్విని అనంతపురం వెళ్లి, రూ.10 వేల పింఛన్ అందజేసింది.

రైతులకు వరం 'వైఎస్సార్ జలకళ'



రైతు గొల్ల నారాయణప్ప పొలంలో బోరు వేయిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం చిన్న, సన్న కారు రైతులకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం జమ్మానిపల్లి వద్ద రైతు గొల్ల నారయణప్ప పొలంలో వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం వైఎస్ జగన్ కృషి చేస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. పంటలు సాగు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉండి, అర్హత కలిగిన సన్న చిన్న కారు రైతుల భూముల్లో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా బోరు వేసి విద్యుత్ సర్వీస్‌తో పాటు మోటారు, పైపులు, స్టార్టర్ అమర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీపీ కవిత, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, సర్పంచ్ పుట్టమ్మ, ఎంపీటీసీ ఆదిలక్ష్మమ్మ, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మండల ఎస్సీ సెల్ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి పాల్గొన్నారు.

పోటీ పరీక్షల శిక్షణ యువతకు వరం



ఎస్పీ ఫక్కీరప్ప చేతులమీదుగా సన్మానం పొందుతున్న లావణ్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీ నిరుద్యోగ యువతకు వరమని అమరాపురానికి చెందిన లావణ్య ఆనందం వ్యక్తం చేసింది. పోలీస్ పోటీపరీక్షల శిక్షణను సద్వినియోగం చేసుకొని బ్యాంకు ఉద్యోగం సాధించిన లావణ్యను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి మంగళవారం సన్మానించారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురానికి చెందిన లావణ్య పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో పోటీపరీక్షలకు సన్నద్ధమైంది. కర్ణాటక బ్యాంకులో పీఓగా ఉద్యోగం సాధించింది. ఎస్పీ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించాలన్న లక్ష్యంతో ఇక్కడికి వచ్చి ప్రిపేర్ అవుతున్నారన్నారు. సివిల్స్‌కు కూడా సన్నద్ధమయ్యేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇక్కడ కంప్యూటర్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కష్టపడి చదువుకోవాలన్న తపన ఉంటే చాలు.. ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్పీ తెలియజేశారు.

మెరుగైన సేవలందించాలి

రొద్దం: గ్రామాల్లో బాలంతలు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని డాక్టర్ జగదీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఆశావర్కర్లు బాధ్యతగా పని చేయాలని సూచించారు. అనంతరం విధులపై అవగాహన కల్పించారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



మాట్లాడుతున్న పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి

అమరాపురం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు, మంగళవారం మండలంలోని బసనవపల్లి, హేమావతి సచివాలయాలను ఎంపీడీఓ మునిస్వామితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. ఫేషియల్ హాజరు వేసిన అనంతరం సచివాలయానికి చాలా మంది రావడం లేదన్నారు. ఇలా చేయడం సరి కాదన్నారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించి, విధులకు రావాలన్నారు. అలాగే ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకూ విధుల్లో ఉండాలన్నారు. నిర్వహణ రిజిష్టర్‌ను తప్పక ఉపయోగించాలన్నారు. ఏ అధికారి ఎక్కడకు వెళుతాడో రిజిష్టర్‌లో పొందుపరచాలన్నారు. కొంతమంది మూమెంట్ రిజిష్టర్‌లో రాసి, వేరే ప్రాంతాలకు వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. పది, ఇంటర్ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసిన వెంటనే ఇంటికి వెళ్లి అందించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. బియ్యం కార్డుల ఈ–కేవైసీ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, ఈఓఆర్డీ సుధాకర, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

పావగడ: తాలూకాలోని మురారాయనహళ్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, దొమ్మతమరి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అరుణ భర్త దొడ్డయ్య (46) గుండెపోటుతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప, హెచ్‌వీ వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు దొడ్డయ్య మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సావిత్రీ బాయి పూలేకు నివాళి

మడకశిర/హిందూపురం టౌన్/రొళ్ల: మడకశిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హిందూపురంలోని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తిరుమలమ్మ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే రొళ్ల మండల కేంద్రంలో సావిత్రీ బాయి పూలే జయంతిని మడకశిర మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాం నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వెలుగులోకి లైన్‌మెన్ అవినీతి బాగోతం



లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న హారున్ బాషా ఓ రైతు పొలంలో డీపీ ఏర్పాటుకు లంచం తీసుకున్నారు. వివరాలు.. ఇటీవల రైతు హుసేన్ పీరా నుంచి రూ.90 వేలు లంచం తీసుకుని పంచాయతీకి చెందిన విద్యుత్ డీపీని సమకూర్చినట్లు వైస్ సర్పంచ్ మురళీమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాదిక్, సచివాలయ కార్యదర్శి నజ్మా, ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో లైన్‌మెన్ అక్రమాలపై ట్రాన్స్‌కో ఏఈ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. రైతు హుసేన్‌పీరా నుంచి లైన్‌మెన్ హారున్ బాషా రూ.80 వేలు లంచం తీసుకుని పంచాయతీ పరిధిలోని డీపీని తీసుకెళ్లి అమర్చినట్లు తేల్చారు. అక్కడ ఉన్న మరో డీపీని అనుమానం రాకుండా పంచాయతీ పరిధిలోని బోర్లకు అమర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ పేర్కొన్నారు.

సస్పెండ్ చేయాలని డిమాండ్

అవినీతి అక్రమాలకు పాల్పడిన లైన్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, కిరణ్, కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్‌కు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకా వ్యాప్తంగా కాంగ్రెస్ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప తెలిపారు. మంగళవారం విరుపసముద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర తాగు, సాగు నీటి పథకం త్వరలోనే పూర్తవుతుందన్నారు. జల జీవన్ మిషన్ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగు నీరు అందిస్తామన్నారు. ఇప్పటికే పైప్ లైన్ పనులు దాదాపు పూర్తయినట్లు వెల్లడించారు. రూ.కోటి నిధులతో అనేక తారు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ జేడీఎస్ సంయుక్త సర్కారులో అభివృద్ధి వేగంగా జరిగిందన్నారు.బీజేపీ సర్కారులో ఎలాంటి నిధులు అందించక పోగా ఎమ్మెల్యే వెంకటరమణప్ప పోరాడి రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.65 కోట్ల నిధులు రాబట్టుకున్నారన్నారు. వచ్చే విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం విరుపసముద్రం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర రెడ్డి. శేషగిరి, రాజేశ్, గుమ్మఘట్ట శ్రీనివాస్, రామాంజి తదిరులు పాల్గొన్నారు.

రేకులకుంట పాఠశాల తనిఖీ

మడకశిరరూరల్: మండలంలోని రేకులకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీవైఈఓ రంగస్వామి, డీఈఓ కార్యాలయ ఏడీ రామకృష్ణ వేర్వేరుగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు, జగనన్న విద్యాకానుక, కోడిగుడ్లు నాణ్యత తదితర వంటగది పరిశుభ్రతపై ఆరా తీశారు. గత నెల 30న విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా పాఠశాలను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ.. నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

కౌన్సిలర్‌కు సన్మానం

పెనుకొండ: కలెక్టర్ బసంత్‌కుమార్ నేతృత్వంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అడ్‌హక్ కమిటీలో సభ్యుడిగా 15వ కౌన్సిలర్ రఘునాథరెడ్డి నియమితులయ్యారు. మంగళవారం చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, టౌన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, పార్టీ నాయకులు రామలింగారెడ్డి, గుట్టూరు ఆంజనేయులు, ఫరీద్, జనార్ధన రెడ్డి, పూల మూర్తి తదితరులు పాల్గొన్నారు.